
ప్రజాశక్తి
గురువారం 27 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



నేడు జర్నలిస్టులకు నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మీడియా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ పర్యవేక్షణలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో కలెక్టరేట్ ఆవరణలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు, కేటరాక్ట్, టేరిజియం ఉన్న వారికి ఉచితంగా జర్నలిస్టు ఆరోగ్య స్కీమ్ ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కబ్జాదారు బరితెగింపు

- వరహాల గెడ్డలో మళ్లీ కంచె నిర్మాణం
- మున్సిపల్ కమిషనర్‌కి టిడిపి ముఖ్యనేత వార్నింగ్
- ఆ స్థలంలోకి ఎందుకెళ్లారని బెదిరింపు



ఆక్రమణల తొలగింపులో పాల్గొన్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణ నడిబొడ్డున సర్వే నంబర్ 410లో ఉన్న వరహాల గెడ్డ భూమి చుట్టూ కబ్జాదారు మళ్లీ కంచె నిర్మించాడు. అధికార పార్టీ ముఖ్య నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో ఆయన దర్జాగా ప్రభుత్వ భూమిని కలిపి ఇనుప కంచె వేయడం వివాదాస్పదమవుతోంది. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, తహశీల్దార్ సురేష్ కలిసి వరహాల గెడ్డ భూమికి సంబంధించిన హద్దులు నిర్ణయించారు. వ్యాపారి కొత్తకోట ప్రసాద్‌కి చెందిన జిరాయతీ భూమి సర్వే నంబర్ 411-9లో ఉంది. వరహాల గెడ్డ, వ్యాపారి భూమి మధ్య హద్దు నిర్ణయించి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇది జరిగి పక్షం రోజులు కాకముందే వరహాల గెడ్డ ప్రభుత్వ భూమిపై కన్నేసిన వ్యాపారి కొత్తకోట ప్రసాద్ మళ్లీ కంచె నిర్మించారు. అధికారపార్టీ ముఖ్యనేత అండతోనే ఆ వ్యాపారి కంచె నిర్మించినట్లు తెలుస్తోంది.

కొద్దిరోజుల క్రితం తహశీల్దార్ సురేష్‌తో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు కలిసి సర్వే నెంబర్ 410లో ఉన్న వరహాల గెడ్డ ఆక్రమణలను తొలగించి హద్దు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి ముఖ్య నేత కమిషనర్ శ్రీనివాసరాజును తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఆ స్థలంలోకి ఎవరు వెళ్లమన్నారని అధికారపార్టీ ముఖ్యనేత వార్నింగ్ ఇచ్చారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వరహాల గెడ్డ భూమిని ఆ వ్యాపారి సొంత స్థలంగా చూపించి రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో సిపిఎం సహా ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేసి సబ్‌కలెక్టర్ వైశాలికి వినతిపత్రం అందజేశారు. వరహాల గెడ్డ భూమి ఆక్రమణదారులందరికీ నోటీసులు జారీ చేశామని సబ్ కలెక్టర్ వైశాలి.. వామపక్ష, ప్రజాసంఘాల నాయకులతో చెప్పారు. రిజిస్ట్రేషన్ జరగలేదని సబ్ కలెక్టర్.. వారితో చెప్పడం చర్చనీయాంశమవుతోంది.

కంచె తొలగింపు

పార్వతీపురం పట్టణంలోని వరహాల గెడ్డ ఆక్రమిత స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వామపక్షాలు, ప్రజాసంఘాలు ఇప్పటికే అనేక ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఇటీవల వరహాల గెడ్డలో కొంత భాగంలో ఆక్రమణలు తాత్కాలికంగా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న వరహాలగెడ్డ స్థలంలో మళ్లీ కబ్జాదారు రెండు రోజుల క్రితం కంచె ఏర్పాటు చేసి ఆక్రమించడం పట్ల వామపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వరహాలగెడ్డ ఆక్రమిత స్థలంలో అక్రమార్కులు వేసిన కంచెను వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ రాజకీయ నాయకులు, ముఖ్యంగా పార్వతీపురం ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయనే ప్రచారం సాగుతోందని చెప్పారు. వరహాల గెడ్డ ఆక్రమిత స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో కోట్లాది రూపాయలు ముడుపులు చేతులు మారాయని ప్రజలు భావిస్తున్నారని, దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమార్కులకు సహకరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన నేతలు తమ ధోరణి మార్చుకోకపోతే వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆక్రమిత స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజలకు అప్పగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు ప్రజల కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. వరహాల గెడ్డ పోరంబోకు స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వి.రమణ, గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు పి.రమణి, పి.సంఘం, టి.జీవ, జి.సూరయ్య, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కార్మిక, గిరిజన సంఘాల నాయకులు

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, గిరిజన, రైతు కూలీ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమాలు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట రైతు, కార్మిక, గిరిజన, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఢిల్లీ రైతు పోరుబాట సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, గిరిజన చట్టాలు, హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎరువులకు సబ్సిడీ ఇవ్వాలని, బ్లాక్ మార్కెట్ లేకుండా చూడాలని కోరారు. అటవీ సంపదను, వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీల ఇచ్చే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పౌర హక్కులను, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, గిరిజన, రైతు కూలీ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పోల ఈశ్వరరావు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాష, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం, రెడ్ స్టార్ పార్టీ జిల్లా నాయకులు తోట జీవా, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగళ దాళి నాయుడు, పలు సంఘాలు నాయకులు పోల రమణి, పి.శ్రీనునాయుడు, గరుగుబిల్లి సూరయ్య, బంకురు సూరిబాబు, రవీంద్ర, లక్ష్మణరావు, బి.వి.రమణ, జి.వి.రమణ, కొల్లి సాంబమూర్తి, విశ్వేశ్వర రావు, రెడ్డి వేణు, లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనోపాధి మెరుగుకు చర్యలు

కేంద్ర ప్రభారి అధికారి సుజాత శర్మ

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజనుల జీవనోపాధిని మరింత మెరుగు పరిచేందుకు అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభారి అధికారి డాక్టర్ సుజాత శర్మ సూచించారు. బుధవారం సీతంపేట ఐటిడిఎలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఎఫ్‌పిఒ గ్రూపులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అటవీ ఉత్పత్తులు అధిక దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ పంటల అభివృద్ధికి ఉద్యాన, ఉపాధి హామీ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. గర్భిణులు తప్పనిసరిగా ఆస్పత్రిలోనే ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఆసుపత్రులు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా మరుగుదొడ్లు, ఆర్‌ఒ ప్లాంట్లు ఉండాలన్నారు. విడివికెల ద్వారా జీడి పంటను ప్రాసెసింగ్ చేయాలని చెప్పారు.



మెట్టుగూడ జలపాతాన్ని సందర్శిస్తున్న కేంద్ర ప్రభారి అధికారి సుజాత శర్మ, కలెక్టర్, జెసి, ఐటిడిఎ పిఒ

జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆస్పిరేషన్‌లో సెక్టార్‌లో 109వ స్థానంలో ఉండే జిల్లా నాలుగో స్థానానికి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. అన్ని పారామీటర్లలో కూడా ముందంజలో ఉందని, విద్యకు సంబంధించి 80వ స్థానం నుండి 11వ స్థానానికి, వ్యవసాయంలో 36వ స్థానం నుండి 19వ స్థానానికి వచ్చిందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగి మొదటి స్థానాన్ని చేరుకునేలా కృషి చేయాలన్నారు.

తొలుత భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతిజ్ఞను అధికారులు అందరూ చేశారు.

ఆహ్లాదకరంగా మెట్టుగూడ జలపాతం

మెట్టుగూడ జలపాతాన్ని కేంద్ర ప్రభారి అధికారి సుజాత శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలపాతం చాలా సుందరంగా, ఆహ్లాదకరంగా ఉందని అన్నారు. జలపాతం పరిసరాలు బాగున్నాయని కితాబిచ్చారు. జలపాతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలపాతం వద్ద కలెక్టర్, ఇతర అధికారులతో ఫోటో దిగారు. భామిని మండలం బొడ్డగూడ అంగన్వాడీ కేంద్రం, హనుమకొండ గ్రామం, బత్తిలి పిహెచ్‌సిని సందర్శించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా వైద్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ టి.కనకదుర్గ, ఎపిఒ చిన్నబాబు, ఇఇ రమాదేవి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణ రెడ్డి, డిడి అన్నదొర, పిహెచ్‌ఒ ఎస్.వి గణేష్ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతిపై

ప్రభుత్వ తీరు దారుణం

వెంటనే ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి : ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

ప్రజాశక్తి - కురుపాం, గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్‌తో కలిసి ఆమె పర్యటించారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. మౌలిక వసతులు, భద్రతా చర్యలను క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల మృతికి గల కారణాలపై ఆరాతీశారు. గురుకులంలో పదో తరగతి విద్యార్థినులు అంజలి, కల్పన మృతిపై విచారం వ్యక్తంచేశారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాజ్యాంగం ఆవశ్యకత, ప్రజాస్వామ్యంలో యువత పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు స్వగ్రామాలైన దండుసుర, కంబగూడ వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి, మృతికి గల కారణాలను తెలుసుకున్నారు.



గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



కురుపాం మండలం దండుసురలో మృతి చెందిన విద్యార్థి కల్పన కుటుంబ సభ్యులకు పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

విద్యార్థులతో ర్యాలీ

జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఆరోగ్యం కార్యకర్తలను నియమించి, విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గుణుపూర్ కూడలి నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఐషీ ఘోష్ పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సరైన వసతులు, తాగునీరు లేక పోవడంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం కనీసం కూడా స్పందించడం లేదని మండిపడ్డారు. మరణించిన విద్యార్థులకు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి. అనిల్, నాయకులు ఎ.గంగారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, నాయకులు పి.తిరుపతిరావు, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై డిఎం శ్రీనివాసరావు

కొనుగోలు కేంద్రాల్లోనే

ధాన్యం విక్రయించాలి

- సివిల్ సప్లై డిఎం శ్రీనివాసరావు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వీరఘట్టం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయాలు జరపాలని సివిల్ సప్లై డిఎం కె.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'కానరాని కొనుగోలు కేంద్రాలు' కథనానికి అధికారులు స్పందించారు. యు.వెంకంపేట, చిదిమి గ్రామాల్లో డిఎం పర్యటించి, బస్తాలతో నిల్వ ఉన్న ధాన్యాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు నిర్దిష్టమైన ధరకు ధాన్యాన్ని విక్రయించాలని రైతులను కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని, శ్రమకు తగ్గ ఫలితం పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ సౌజన్య, గ్రామీణ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

పుస్తక మహోత్సవానికి విశేష స్పందన

అలరించిన సాహిత్య కార్యక్రమాలు

ప్రజాశక్తి-పార్వతీపురం


పార్వతీపురం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం రెండోరోజు బుధవారం ఉత్సాహంగా సాగింది. పురిపండా అప్పలస్వామి ప్రాంగణం విద్యుత్ కాంతులతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. పుస్తక ప్రియులు, పలువురు కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు బుక్‌స్టాల్స్‌ను తిలకించారు. పలు పాఠశాలల విద్యార్థులను పుస్తక మహోత్సవాన్ని తిలకించి పలు రకాల పుస్తకాలను కొనుగోలు చేశారు. డాక్టర్ డి.వెంకటరావు అధ్యక్షతన సాహితీ కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన 'నదికి ఒక భాష ఉంది' అనే పుస్తకాన్ని రిటైర్డ్ ఉపాధ్యాయులు తేజోమూర్తుల సూర్య ప్రకాష్ పరిచయం చేశారు. కళింగాంధ్ర కథలు గురించి మరో రచయిత మల్లిపురం జగదీష్ చెప్పారు. పుస్తక మహోత్సవాన్ని వేదంతా జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించి, పుస్తకాలను కొనుగోలు చేశారు. పలువురు ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

ఆకట్టుకున్న జెవివి ప్రదర్శనలు

మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దెయ్యాలు, భూతాలపై నమ్మకాలను పారదోలుతూ నిర్వహించిన శాస్త్రీయ కార్యక్రమాలు ఆకర్షించాయి. చేతి మీద రాసిన తెల్ల సున్నాన్ని రక్తపు రంగుగా మార్చడం, చేతి మీద కర్పూరాన్ని వెలిగించి నాలుకపై పెట్టడం, బలంగా ఊదిన తాడు కింద పడకుండా ఉండే ప్రయోగాలు చాలా అద్భుతంగా చేపట్టారు. ఈకార్యక్రమాలను జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్.మహేష్, ఆర్.సతీశ్ రాజు, జీ.మురళీధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులను, పుస్తక ప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుస్తక మహోత్సవాన్ని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఐషీ ఘోష్ తిలకించారు. ఆమెకు బుక్ ఫెస్టివల్ నిర్వాహకులు, ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికారు.



బుక్ ఫెస్ట్‌కు హాజరైన వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు



చేతిపై కర్పూరం వెలిగించడాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



వేదికపై మాట్లాడుతున్న రచయిత మల్లిపురం జగదీశ్

మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి సమీపంలో ఎల్విన్‌పేట, పి.లేవిడి ప్రధాన రహదారిలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. మహిళా మార్ట్ లో ఏర్పాటు చేసిన సరుకులను పరిశీలించి కొన్నిటిని కొనుగోలు చేశారు. అనంతరం క్యాష్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళా సంఘ సభ్యులంతా మార్ట్‌లోనే సరుకులు కొనుగోలు చేయాలని సూచించారు. మార్ట్ వెలుపల ఏర్పాటు చేసిన ఎగ్ కార్ట్‌ను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్ పర్సన్ కడ్రక కళావతి, టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, తెలుగు మహిళా నియోజకవర్గ కార్యదర్శి వెంపటాపు భారతి, మండల సమాఖ్య అధ్యక్షులు సుబ్బలక్ష్మి, డిపిఎంలు శ్రీనివాసరావు, జయశ్రీ, శ్రీరామ్మూర్తి, ఎపిఎంలు వెంకట్రావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



మహిళా మార్ట్ లో సామగ్రి కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రాజ్యాంగమే అమూల్యమైన ఆస్తి

ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కురుపాం.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి అమూల్యమైన ఆస్తి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయకు జగదీశ్వరి తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం కురుపాం గాంధీ నగర్ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛలను కాపాడే దిశగా ప్రతి పౌరుడూ రాజ్యాంగ విలువలను ఆచరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. ప్రజలంతా రాజ్యాంగ విప్లవాత్మక భావాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్.. నివాళులర్పిస్తున్న ఎఎంసి చైర్‌పర్సన్ గొట్టాపు గౌరి, సభ్యులు

పార్వతీపురంటౌన్ : మున్సిపల్ కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కమిషనర్ కిశోర్‌కుమార్ నివాళులర్పించారు. అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెప్మా సిఎంఎం పుష్ప, సిఒలు ఈశ్వరరావు, పద్మ, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఎఎంసి కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎఎంసి చైర్‌పర్సన్ గొట్టాపు గౌరీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వెంకటరమణ, ఎఎంసి ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్వతీపురం : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఎఒ ఎన్.చిన్నారావు, ఇ,హెచ్ సెక్షన్ల సూపరింటెండెంట్లు జి.శ్రీరామమూర్తి, వై.జయలక్ష్మి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయ ఎఇఐఇ గజపతి రావు, వివిధ శాఖల సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సూపరింటెండెంట్ జి.శ్రీరామమూర్తి అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

బలిజిపేట : బలిజిపేట హైస్కూల్లో అంబేద్కర్ చిత్రపటానికి ఎంఇఒ సామల సింహాచలం, హెచ్‌ఎం వెంకటరమణ నివాళులర్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొత్స గణేష్, సింహాద్రి, ఉషారాణి, జానకమ్మ, శ్రీదేవి, త్రినాథరావు, అప్పారావు, జ్యోతి పాల్గొన్నారు.

సాలూరు : భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను సాధించే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం తన నివాసంలో కార్యకర్తలతో కలిసి బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు గిరి రఘు, జరజాపు శ్రీను పాల్గొన్నారు.

సాలూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.టి. రత్నకుమార్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ బి.ఎం.ప్రసాద్, డిఇ బి.వి.ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వి.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లలిత కుమారి, విజయలక్ష్మి, రామకృష్ణ, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు.. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజన్నదొర, నాయకులు

సీతానగరం : మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ దాలి నాయుడు, సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్న లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి అంబేద్కర్ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వీరఘట్టం : రేగులపాడు కెజిబివిలో ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పివిఆర్ పురంలో కూడా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఎస్ఒ ఉషా రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బలిజిపేట.. రాజ్యాంగ దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఇఒ సింహాచలం

రైతన్న సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం శివన్నపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సమగ్రశిక్ష ద్వారా మంజూరైన నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు మౌలిక వసతులు, భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి, ఎఒ నాగేశ్వరరావు, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సాలూరు

కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజన గ్రామాలకు నూతన రహదారుల నిర్మాణానికి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందని టిడిపి మండల నాయకులు తెలిపారు. బుధవారం సాలూరు మండలం కురుకుట్టి పంచాయతీ నందేడవలస నుండి సంపంగిపాడు, సీకుపాడు వరకు సుమారు 4.2 కిలోమీటర్ల మేర రూ.నాలుగు కోట్లతో బిటి రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ నాయకులు బుస తవుడు, సంపంగిపాడు, కురుకుట్టి సర్పంచులు చంద్రయ్య, అప్పారావు, కురుకుట్టి ఎంపిటిసి గెమ్మెల సుబ్బారావు, టిడిపి నాయకులు నరసింహ రాజు, దొర లక్ష్మణ, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, ఐటిడిఎ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



లక్ష్మణరావు (ఫైల్)


ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పెద్దవలసకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ మంచాల లక్ష్మణరావు గుండెపోటుతో మరణించారు. బుధవారం జీడిమొక్కల సర్వే నిర్వహిస్తుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎపిఒ సత్యనారాయణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు.

రీసర్వేపై సమీక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రీసర్వేపై సర్వేయర్లతో డిడి త్రివిక్రమరావు సమీక్షించారు. సర్వే విధి విధానాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడి లక్ష్మణరావు, తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజా వైద్యం ప్రజల హక్కు

ప్రజాశక్తి-సాలూరు

ప్రజా వైద్యం ప్రజల హక్కని, వైద్యాన్ని ప్రయివేటీకరించడం సామాన్యులకు వైద్యం అందకుండా చేసే దురుద్దేశమేనని వైసిపి నాయకులు విమర్శించారు. బుధవారం సాలూరు పట్టణంలో 17వ వార్డులో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు, కౌన్సిలర్ గులిపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యాన సంతకాలు సేకరించారు.

బహుళ పంటలతో రైతుకు లాభం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

బహుళ పంటల సాగుతో రైతులకు లాభమని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ తెలిపారు. మండల పరిధిలో సంతోషపురం గ్రామంలో రబీ డ్రై షోయింగ్ విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. బహుళ పంటల వల్ల నేలను కప్పి ఉంచి, 365 రోజులు పంటలు సాగు చేయడం సులభమని, అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. రైతులకు రబీ డ్రై షోయింగ్ గూర్చి వివరించి, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఎఎలు, ఎన్ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, తిరుపతిరావు, పోలినాయుడు, వెంకటనాయుడు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎఒ అవినాష్

కొత్తవలసలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కొత్తవలస గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ అవినాష్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గిస్తే రైతులకు ప్రయోజనమన్నారు. సేంద్రియ ఎరువులతో అనేక లాభాలు ఉన్నాయని రైతులకు అవగాహన కల్పించారు.

అచ్చపువలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని అచ్చపువలస గిరిజన గ్రామంలో బుధవారం వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులు తదితర రకాలైన రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నాయకమ్మగూడలో యాంటీ లార్వా ఆపరేషన్

ప్రజాశక్తి-సీతంపేట

నాయకమ్మగూడ గ్రామంలో దోనుబాయి పిహెచ్‌సి వైద్యాధికారి భానుప్రతాప్ , మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాటాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటిఎస్ ఝాన్సీ రాణి, కార్యదర్శి శ్రీను, అప్పలసూరి పాల్గొన్నారు.





పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు ; పాచిపెంటలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలి

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా బుధవారం ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ఉద్యోగులు బుధవారం పట్టణంలో నిరసన తెలిపారు. బేస్ యూనిట్ ప్రధాన కార్యదర్శి టెక్కలి ధర్మారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా నాలుగు లేబర్ కోడ్లు అమలు చేయడం అప్రజాస్వామ్యమని, యజమానులకు అనుకూలమని చెప్పారు. ఈ కోడ్లు కార్మికుల జీవితాలు, హక్కులు, గౌరవంపై విధ్వంసక దాడి లాంటివని అన్నారు. తరతరాలుగా కష్టపడి సాధించిన రక్షణలను కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. వెంటనే లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది ఉద్యోగులు, పెన్షనర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

పాచిపెంట : లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పాచిపెంటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల సేవలో మునిగిపోయి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అత్యంత హానికరమైన లేబర్‌కోడ్లను రద్దు చేసి, గత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. ఈ పోరాటానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.రమేష్, టి.వాసు, టి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విచారణ అధికారిని మార్చాలి

ప్రజాశక్తి-సీతంపేట

దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాలకు ముందస్తు సమాచారం లేకుండా విచారణ వాయిదా వేయడమంటే.. ఎపిఒ, డిడిలను రక్షించాలనే దుర్బుద్ధితో ఉన్నారని దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాల జెఎసి జిల్లా కన్వీనర్ డి.గణేష్ ఆరోపించారు. విచారణ అధికారిని మార్చాలని ఆయన డిమాండ్‌చేశారు. బుధవారం సీతంపేట ఐటిడిఎ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11.30 గంటలకు సీతంపేట ఐటిడిఎలో విచారణ కోసం జెఎసి ఆధ్వర్యంలో హాజరైన నాయకులకు ముందస్తు సమాచారం లేకుండా విచారణ వాయిదా వేయడం దళితులను అవమానించడమే అవుతుందన్నారు. ట్రైకార్ జిఎం మొదటి నుంచి ఎపిఒ, డిడిలను ఎలా కాపాడాలో చూస్తున్నారని, అందులో భాగంగా పథకం ప్రకారం విచారణ వాయిదా వేశారన్నారు. విచారణ అధికారి మణికుమార్‌పై తమకు నమ్మకం లేదని, వేరే అధికారితో విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. టెండర్ నోటిఫికేషన్ లేకుండా లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కెఎన్‌పిఎస్ జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, డిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు, అంబేద్కర్ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టి.రమణ పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలని రిలే దీక్షలు



దీక్షలు చేస్తున్న గిరిజన సంఘం, వ్యకాస నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-పార్వతీపురం

కురుపాం నియోజకవర్గంలోని తోలంగూడ, డి .భారామని, బారామణిగూడ, సొల్డంగూడ, మాలగూడ, పోక్కిరి, వనకాబడి, వాడజంగి గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు వేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఐటిడిఎ ముందు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. డోలిమోతల్లేని గిరిజన గ్రామాలుగా చేస్తామని ప్రకటించి 20 నెలలు దాటుతున్నా ఇంతవరకు ఏమీ చేయలేదన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారని, కానీ హామీ అమలు కాలేదని విమర్శించారు. వెంటనే పై గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బుధ, గురువారాల్లో రిలే నిరాహార దీక్షలు చేసి 28న ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తామని చెప్పారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున గిరిజనులను కదిలించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు అడ్డమేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.సూరిబాబు, గిరిజనులు పాల్గొన్నారు.



ఎపిఎన్‌జిఒ పార్వతీపురం యూనిట్ నూతన కార్యవర్గం

ఎపిఎన్‌జిఒ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఎపిఎన్‌జిఒ పార్వతీపురం తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి .దీంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి ఆర్.ఈశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్.ఎస్ ప్రకాశరావు ప్రకటించారు. సుమారు 1500 మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్న ఈ యూనిట్‌లో 16 పోస్టులకు ప్రెసిడెంట్‌గా సువ్వాడ దుర్గా ప్రసాద్ (మెడికల్), సెక్రెటరీగా జొన్నాడ విక్టర్ (పంచాయత్ రాజ్), కోశాధికారిగా జి.వినయ్ కుమార్ (మున్సిపాలిటీ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వై.వి.సత్యనారాయణ (ప్లానింగ్), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి.పుష్ప (మెడికల్), వైస్ ప్రెసిడెంట్‌గా మధుశంకర్ (మెడికల్), ఉడమల వెంకట నాయుడు (పంచాయతీ శాఖ) ఎన్నికయ్యారు. వీరితో 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ముందుగా రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జివిఎస్ కిశోర్, సెక్రటరీ రంగచారి ఆధ్వర్యాన సుమారు 650 ఉద్యోగులతో ర్యాలీగా వెళ్లి బిఆర్ అంబేద్కర్‌కు పూలమాల వేశారు. కిశోర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా కలిసి ఏకగ్రీవం చేయడం ఐక్యతకు సంకేతమని చెప్పారు. ఎన్నికల పరిశీలకులుగా పద్మాలత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ నాయకులు సంగమేశ్వర రావు, సూర్యనారాయణ, వెంకట నాయుడు, ఎస్‌వి రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

6న కురుపాం యూనిట్ ఎన్నికలు

కురుపాం : డిసెంబరు 6న ఎపిఎన్‌జిఒ కురుపాం యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి జె.విక్టర్, సహాయ ఎన్నికల అధికారి ఎస్.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 510 మంది సభ్యులతో ఉన్న ఈ యూనిట్‌లో మొత్తం 15 పోస్టులకు గాను ఈ నెల 29న నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియ కురుపాం పెన్షనర్స్ భవనంలో నిర్వహిస్తామని చెప్పారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు చెందిన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సభ్యులు పాల్గొని యూనిట్ ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగు

ఆర్‌బిఎస్‌కె పిఒ జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఆర్‌బిఎస్‌కె పిఒ జగన్ మోహనరావు

ప్రజాశక్తి-సీతానగరం

మెరుగైన ఆరోగ్య అంశాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించు కోవాలని రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు తెలిపారు. ఆరోగ్యానికి ప్రధానమైనది పరిశుభ్రత, పోషకాహారమని, తద్వారా రోగనిరోధకశక్తి వృద్ధి చెంది వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. సీతానగరం జెడ్.పి ఉన్నత పాఠశాలను బుధవారం వైద్య బృందంతో కలిసి ఆయన సందర్శించారు. ఆర్‌బిఎస్‌కెలో బాగంగా విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఎంత మందికి స్క్రీనింగ్ పూర్తి చేశారు, 4డిలు ఏమైనా గుర్తించారా? అని అడిగి తెలుసుకొన్నారు. యాప్‌లో ఆన్‌లైన్ నమోదు పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలో మొత్తం ఎన్ని స్కూళ్లలో స్క్రీనింగ్ ఏ మేరకు జరిగిందని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. 4డిలు గుర్తించడంలో దృష్టిసారించాలన్నారు. కిశోర బాలికల్లో రక్తహీనతతో ఎవరైనా ఉన్నారా? అని సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. ఆరోగ్యం అంశాలపై విద్యార్థులకు గల ప్రతిభను పరీక్షించారు. హెల్త్ స్క్రీనింగ్‌తో పాటు విద్యార్థులకు ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని, ఐఇసి, ఫ్లిప్‌చార్టులు ఉపయోగించాలని సూచించారు.

విద్యార్థులందరితో చేతుల పరిశుభ్రతపై డెమో చేయించారు. ఆరోగ్యం మెరుగు పడే సూత్రాలు విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు ఐ. ప్రసన్నలక్ష్మి, సూపర్వైజర్ గోపాల్ నాయుడు, వైద్య సిబ్బంది లోకేశ్వరి, బంగారమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు విఒఎలను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పచ్చదనం -పరిశుభ్రతపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, విఒఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు